


ఇంటర్ ఇంగ్లీష్ పేపర్-2కు

655 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 5వ తేదీ జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 27,575 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 87 జనరల్, 14 ఒకేషనల్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంగ్లీష్ పేపర్-2 పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జనరల్ 27,052 మంది, ఒకేషనల్లో 1,178 మంది మొత్తం 28,230 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 579, ఒకేషనల్లో 76 మంది, మొత్తం 655 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీటి వసతి, పోలీసు బందోబస్తు, విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా బస్సుల సౌకర్యం కల్పించామని ఆర్ఐఓ ఆ ప్రకటనలో తెలిపారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వకపోతే ...

ఎర్రగుట్టను ఆక్రమిస్తాం...



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానిక యశోదానగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో కరకంబాడీ ఇళ్లస్థలాలు పోరాట కమిటీ మంగళవారం సదస్సును నిర్వహించింది. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కరకంబాడీ పంచాయతీలోని 10వేల ఎకరాల ప్రభుత్వ భూములు భూకబ్జాదారుల చేతుల్లో పెట్టుకుని కంచెలు వేసుకుని ఆక్రమించుకుంటుంటే రెవెన్యూ శాఖ చోద్యం చూస్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇళ్లులేని పేదలందరికీ ఇంటిస్థలాలు ఇచ్చి న్యాయం చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చి, అర్హులుగా గుర్తించి జగనన్న పట్టా ఇచ్చిన నిరుపేదలకు సైతం స్థలాలు చూపకపోవడం వారిని మోసం చేయడమే అన్నారు. పట్టాలు ఇచ్చి ఏళ్లు గడిచినా స్థలం చూపకపోవడంతోనే ప్రభుత్వ భుమి అయిన ఎర్రగుట్టపై గుడిసెలు వేసుకోవల్సి వచ్చిందన్నారు. భూకబ్జాదారులను వదిలి పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు, పోలీసులు తెల్లవారు జామున జేసిబిలతో తొలగించడం అడ్డుకున్న మహిళలపై దాడులు చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. 153 /1 సర్వేనెంబర్‌లో ఉన్న 125 ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్దులు రవి ఆక్రమించి తప్పుడు రికార్డు కాగితాలతో కోర్టుకు వెళ్లారని, దీనిపై తిరుపతి జిల్లా కోర్టు సిద్దుల రవి దొంగని సిబిఐ, సిబి సిఐడి ఎంక్వయిరీ చేసి సిద్దుల రవిని అతనికి సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోమని 2018లో జిల్లా సివిల్ జడ్జి జడ్జిమెంట్ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. 2018లో జడ్జిమెంట్ ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా కేసులు పెట్టకుండా ఉండడం వెనుక ఆంతర్యమేంటని తెలపాలన్నారు. ఇకనైనా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అలసత్వం వహిస్తే ఎర్రగుట్టను మళ్లీ పేదలు ఆక్రమిస్తారని హెచ్చరించారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు సెల్వరాజు, నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, నాయకులు సత్యశ్రీ, రాజశేఖర్, శివానందం, దీప, అభి, ప్రశాంత్, ప్రకాష్ పాల్గొన్నారు.

సూర్యప్రభపై శ్రీకాళహస్తీశ్వరుని విహారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు రథంపై అధిరోహించి స్వామి వారిని అనుసరించారు. సూర్యప్రభ వాహనంపై పరమశివుడు విహరిస్తుండగా... మూషిక వాహనంపై వినాయకస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై స్వామి, అమ్మవార్ల వెంట అనుసరించారు. మిరుమిట్లు గొలిపే రంగుల వలె కొత్త గొడుగులు, పదాతి దళాలు, మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, కోలాటాలు, భజన బృందాలు ముందు నడుస్తుండగా... స్వామి, అమ్మ వార్ల పురవిహారం జనరంజకంగా సాగింది. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులను భక్తులు దర్శించుకున్నారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ఏఈవో లోకేష్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ తనిఖీదారు హరిబాబు యాదవ్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రావణాసుర- మయూర వాహనం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రావణ బ్రహ్మావాహనంపై పరమేశ్వరుడు మయూర వాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు పురవీధుల్లో ఊరేగనున్నారు. లంకాధీశుడైన రావణబ్రహ్మపై ఆధిపత్యాన్ని చెలాయిస్తూ స్వామివారు, మయూర వాహనంపై అమ్మవారు కావనున్నారు. కాగా ఉదయం పరమేశ్వరుడు హంస వాహనం పైనా, పార్వతీదేవి యాళి వాహనం పైనా పురవీధుల్లో ఊరేగుతారు.

నేడు గాంధర్వరాత్రి

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ తిరునాళ్లను గాంధర్వరాత్రిగా పిలుస్తారు. గాంధర్వ రాత్రి అంటే రావణాసురుడు ప్రధాన భూమిక పోషించగా, నారద తుంబర్లతో పాటు గాంధర్వులు సమావేశమై సకల దేవ, భూత గణాల సమక్షంలో పరమేశ్వరుని కీర్తిస్తారు. ఈ నేపథ్యంలో స్వామివారు రావణాసురునిపై, అమ్మవారు మయూర వాహనంపై ఊరేగుతారు.

భూత నాథునిపై శివయ్య వైభవం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు గంగాదేవి సమేతుడై భూతవాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చిలుక వాహనంపై స్వామి వారిని అనుసరించారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప, స్వామి, అమ్మవార్లను అనుసరించారు. అంతకు మునుపు ఆలయంలోని అలంకార మండపంలో పంచమూర్తులకు ఆలయ పురోహితులు విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం పురవిహారానికి తీసుకువచ్చారు. నూతన రాజగోపురం గుండా తేరువీధులోకి ప్రవేశించారు. ఆ తరువాత నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధి గుండా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరిగింది. భూత, చిలుక వాహనాలపైన పురవిహారం చేస్తున్న శివ, పార్వతులను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం

ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్



శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ చెప్పారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లను మంగళవారం ఆయన ఆలయ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆలయ పరిపాలన భవనంలో అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ మాట్లాడుతూ... మహాశివరాత్రి పర్వదినాన సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇందుకు ఆలయ అధికారులతో పోలీసులు సమన్వయం చేసుకోవాలన్నారు. క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా చూస్తామన్నారు. బ్రహ్మోత్సవాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ఆదిదంపతుల కల్యాణం రోజున బాల్యవివాహాలు జరగకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఎస్‌పిగా కృష్ణకాంత్ పటేల్ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి- తిరుపతి సిటి: తిరుపతి జిల్లా నూతన ఎస్‌పిగా కృష్ణకాంత్ పటేల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన ఆయన గతంలో రంపచోడవరం ఏసిపిగా, కర్నూలు జిల్లా సెబ్ అదనపు ఎస్‌పిగా, విజయవాడ కమిషనరేట్‌లో శాంతిభద్రతల డిసిపిగా విధులు నిర్వహించారు. సాధరణ బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా ఎస్‌పిగా బదిలీపై వచ్చిన ఆయన మంగళవారం వేకువజామున తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుపతి ప్రకాశం రోడ్డులోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆయన ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించి మీడియాతో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, కచ్చితత్వంతో ప్రణాళికలను రూపొందించి ముందుకు తీసుకువెళ్తామన్నారు. తిరుపతికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, మానవసేవయే మాధవ సేవగా భావించి, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా శాంతిభ్రదతలను కాపాడుకుంటూ అన్ని రకాల భద్రతాచర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, శ్రీసిటీ పారిశ్రామిక వాడ, వంటి సంక్లిష్టమైన మౌలిక సదుపాయాలు నెలకొని ఉన్నాయి, ఇక్కడ కూడా తగిన గట్టి భద్రత చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి జిల్లా తమిళనాడు రాష్ట్రంలో ఎక్కువగా సరిహద్దు ఉందని, కర్ణాటక దగ్గరగా ఉందని, ఇరుగుపొరుగు జిల్లాల పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సరిహద్దుల ద్వారా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు అనేక బాధ్యతలు ఉంటాయి, కానీ సమస్య గురించి స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడి వారి పట్ల సానుభూతిపరులై సహనంతో వ్యవహరించి, వారికి పరిష్కారమార్గం చూపాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మీడియా కూడా సహకారం అందించాలని కోరారు. ట్రైనీ ఐపిఎస్ కదేవరాజ్ మనీష్ పాటిల్, ఎఎస్‌పిలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, సెబ్ ఎఎస్‌పి రాజేంద్ర, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళా బాధ్యత కీలకం



ప్రజాశక్తి- తిరుపతి సిటి: సమాజాభివృద్ధిలో మహిళల బాధ్యత చాలా కీలకమని తిరుపతి కార్పొరేషన్ మేయరు డాక్టర్ శిరీషా తెలిపారు. ప్రముఖ బిఎన్ఐ కాంపియన్ మొదటి చాప్టర్ (తిరుపతి) ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షులు డాక్టరు పి.శ్రావణ కుమార్ రెడ్డి అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వివాహాభోజనం ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి తిరుపతి మేయరు ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలు ఆదర్శంగా ఉండాలన్నారు. సమాజ అభివృద్ధి మహిళల చేతుల్లోనే ఉందని, తమ పిల్లలను బాగా పెంచితే సమాజం బాగుంటుందని సూచించారు. పాఠశాలల్లో కూడా మార్కుల కాకుండా విలువలు, విజ్ఞానాన్ని పెంచేలా చదువు ఉండాలని, అప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ఉమెన్ ఎన్‌ఫవర్‌మెంట్ ఇంకా పుల్‌ఫిల్ కాలేదని అభిప్రాయపడ్డారు. ఆడ, మగ ఇద్దరు ఒకర్నిఒకరు ప్రోత్సహించుకుని ముందుకు వెళ్లితే సమసమాజం ఏర్పడుతుందన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇటీవల ఆర్మీలో సైతం సైనాధికారిగా మహిళలు నియమింపడ్డారని, ఇది శుభపరిణామం అన్నారు. అ సంస్థ అధ్యక్షులు డాక్టరు శ్రావణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 18 నెలల క్రితం బిఎన్ఐ కాంపియన్ మొదటి చాప్టర్ ఏర్పడిందన్నారు. స్థానంగా ఉన్న రకరకాల వ్యాపారాలకు సంబంధించిన వ్యాపారవేత్తలు ఒకటిగా ఏర్పడి, వారి బిజినెస్‌లను విస్తృత పరచడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇప్పటి వరకు 80మంది సభ్యులు ఇందులో ఉన్నారని తెలిపారు. 23 కోట్ల రూపాయలు తిరుపతి చాప్టర్ ద్వారా లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. అనంతరం తమ చాప్టర్‌లో ఉన్న 14 మంది మహిళా వ్యాపారవేత్తలను మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్కరించారు. కార్యక్రమంలో పి.సుబ్రమణ్యం, డాక్టరు కామిశెట్టి నరేంద్రకుమార్, మణికంఠరెడ్డి, కీర్తి, అపర్ణ, నీరజ, చంద్రశ్రావణి, హర్షితారెడ్డి పాల్గొన్నారు.

ఉపఎన్నికల పరిణామాలు పునరావృతం కాకూడదు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: గతంలో తిరుపతి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 35వేల నకిలీ ఓట్లు సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి సృష్టించారని, ఇలాంటి పరిస్థితులు రాష్ట్రంలో మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని రాజకీయ పార్టీలకు, మేధావులకు, పౌరసంస్థలకు, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి హితవు పలికారు. మంగళవారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో 'ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై జరిగిన కళాజాతకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయ పార్టీల మధ్య ఉండాల్సిన సైద్ధాంతిక విభేదాలు కనుమరుగై ఆయా రామ్ గాయా రామ్ సంస్కృతి కొనసాగుతుందన్నారు. ప్రతిపక్షాలపై దాడులు, ఘర్షణలు, అధికార యంత్రాంగంతో ఇబ్బందులకు గురిచేయడం లాంటి చర్యలు, అధికార పార్టీలు కొనసాగించడం ప్రజాస్వామ్యానికి అవరోధమన్నారు. వాలంటీర్ల వ్యవస్థను వినియోగించుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని అందుకు తగ్గట్టు వాతావరణం ప్రభుత్వాలు కల్పించాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికార పార్టీ ప్రలోభావాలకు ఓటర్లు గురి అవ్వద్దని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన జి.ఫల్గుణ కుమార్ మాట్లాడుతూ పట్టణాలలో ఓటింగ్ శాతం పెరుగుదలకు కళాయాత్ర బృందం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. ప్రముఖ రచయిత కోటా పురుషోత్తం, ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ప్రొఫెసర్ కిరణ్ క్రాంతి చౌదరి, రంగం ప్రజాసంస్కృతిక వేదిక కార్యదర్శి రాజేష్ నేతృత్వంలో ఓటరులను ప్రభావితం చేస్తున్న అనేక అంశాలపై ఆటపాట మాటలతో సబికులను ఆకట్టుకున్నారు.

కబ్జాకు గురైన

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో కందారపు మురళి డిమాండ్



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ పరిధిలో అర్హులైన నిరుపేదలకు జగనన్న ఇంటి పట్టాలు ఇచ్చి, ఇక్కడున్న ప్రభుత్వ భూములను విడిచిపెట్టి దూరప్రాంతమైన చిందేపల్లిలో ఇళ్ల స్థలాలుచూపడం ఎంత వరకు సమంజసమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక రణధరపురం గ్రామపంచాయతీలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం, టిడిపి, జనసేన పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ మంగళం పరిధిలో అనేక ప్రభుత్వ భూములున్నాయని, వాటిని అధికార వైసిపికి చెందినవారు యథేచ్ఛగా కబ్జా చేస్తున్న రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని, వెంటనే కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మంగళం పరిధిలో జగనన్న ఇంటి పట్టాలు పొందిన పేదలకు స్థానికంగానే ఇళ్ల స్థలాలు చూపుతామని పార్టీలకతీతంగా ఎమ్మెల్యే అభ్యర్థి అయినా వారి మేనిఫెస్టోలో చేర్చితే వారికి ఓటు వేయడానికి ప్రజలు ఆలోచిస్తారన్నారు. ప్రజాసమస్యల గొంతుక వినిపిస్తున్న వారిపై దాడులకు దిగితే ఎర్రజెండా నాయకత్వం చూస్తూ ఊరుకోదని, తగిన గుణపాఠాన్ని తప్పక నేర్పిస్తామన్నారు. టిడిపి, జనసేన పార్టీల నాయకులు సురేష్, చంద్ర, సుబ్బు యాదవ్, అల్లాభాష, రత్నం, కిషోర్ మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి పులివర్తి నాని జగనన్న ఇంటి పట్టాలు పొందిన వారికి స్థలాలు స్థానికంగానే చూపడానికి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థానికంగానే ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి రౌండ్ టేబుల్ సమావేశం ఏ నిర్ణయం చేసినా ఆ నిర్ణయం మేరకు సంపూర్ణ మద్దతు తెలిపి భాగస్వామ్యం వహిస్తామన్నారు. అలానే 2019 ఎన్నికల ప్రచారభాగంలో భాగంగా బిటిఆర్ కాలనీలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అధికారంలోకి రాగానే మూడునెలల్లో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ ప్రజలకు తెలుగు గంగ ఇస్తామని హామీ ఇచ్చారని, నేటి వరకు హామీగానే మిగిలిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పి.బుజ్జి, బాదుల్లా, మోదిన్, హమీద్, వెంకటేష్ పాల్గొన్నారు.


టిడిపి రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మహబూబ్ బాషా

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్ట్ మహబూబ్ బాషా టిడిపి రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నియమితులయ్యారు. మంగళవారం టిడిపి టౌన్‌బ్యాంక్ మాజీ అధ్యక్షులు పులిగోరు మురళీకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తిరుపతి నియోజకవర్గం నుంచి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చన్ననాయుడు టిడిపి రాష్ట్ర మైనారిటీ ఆర్గనైజ్ సెక్రెటరీగా మహబూబ్ బాషా నియమించారని అలాగే మనూరు జయకుమార్ వాణిజ విభాగం రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీగా నియమించినందుకు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వైస్‌చైర్మన్ రామూర్తి రాయల్, మాజీ డైరెక్టర్లు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరామయ్య, నశ్రుదిన,ముజాముదిన్ పాల్గొన్నారు.



మునిలక్ష్మిపై దాడి అమానుషం

పరామర్శించిన సిపిఎం నేతలు



ప్రజాశక్తి- తిరుపతిటౌన్

తిరుపతి నగరంలో జరిగే పలు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే సామాజిక కార్యకర్త మునిలక్ష్మిపై గుర్తు తెలీని కొందరు దుండగులు దాడికి పాల్పడటాన్ని సిపిఎం నేతలు వి.నాగరాజు, కందారపు మురళి తీవ్రంగా ఖండించారు. మంగళవారం మునిలక్ష్మిని ఆమె స్వగృహంలో పరామర్శించారు. సోమవారం రాత్రి కుర్రకాల్వ వద్ద పేదపిల్లల కోసం తాను నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్‌కు వెళ్లి తన కుమార్తెతో తిరిగి స్కూటర్‌పై వస్తుండగా గుర్తు తెలీని కొందరు వ్యక్తులు తనపకై కత్తితో దాడికి పాల్పడ్డారని, కత్తి గురి తప్పడంతో తాను కిందపడిపోయాయని దీంతో గాయాలయ్యాయని తెలిపారు. చుట్టుపక్కల వారు గమనించడంతో దుండగులు పారిపోయారని తెలిపారు. పోలీసులు మునిలక్ష్మిపై దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు నూతన జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

శ్రీకాళహస్తి: భారత్ నేషనల్ పార్టీ రాయలసీమ మహిళా కో-ఆర్డినేటర్, ఆ పార్టీ తిరుపతి అసెంబ్లీ అభ్యర్థి నెల్లూరు మునిలక్ష్మి మీద దుండగల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త నిరంజన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని పోలీసు వైఫల్యంగా పరిగణిస్తున్నట్లు ఆయన తెలిపారు. వెంటనే దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేసి లక్ష్మికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దాడిని ఖండించిన జైభారత్ అధినేత జేడీ లక్ష్మీనారాయణ

రేణిగుంట: జైభారత్ నేషనల్ పార్టీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిని రాయలసీమ మహిళా కో-ఆర్డినేటర్ నెల్లూరు మునిలక్ష్మిపై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నం చేయడాన్ని జైభారత్ అధినేత జేడీ లక్ష్మీ నారాయణ ఖండించారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడవద్దనే దాడి: మునిలక్ష్మి

తాను జైభారత్ నేషనల్ పార్టీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడవద్దనే అగంతుకులు ఈ దాడికి పాల్పడ్డారని మునిలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. నీతినిజాయితీకి మారుపేరైన జేడీ లక్ష్మీనారాయణ రాష్ట్ర అభివృద్ధే ఎజెండాగా నడుపుతున్న జైభారత్ నేషనల్ పార్టీ రాయలసీమ కో-ఆర్డినేటర్‌గా తాను చురుకుగా పనిచేస్తుండటంతోనే తనపై హత్యయత్నానికి ప్రయత్నించారని ఆరోపించారు.

నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణ : కమిషనర్



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న చర్యలపై ఓటరు నమోదు అధికారి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పారదర్శంగా నిర్వహించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని క్లెయిమ్స్, అబ్జెక్షన్లపై తదితర అంశాలపై వివరించారు. తిరుపతి నియోజకవర్గంలో 267 పోలింగ్ బూతులు ఉండగా, 1500 ఓటర్లు దాటిన పోలింగ్ బూతులు 4 ఉన్నాయని తెలిపారు. కావున వాటికి సమీపంలోనే మరో 4 సహాయ బూతులు ఏర్పర్చేందుకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈసందర్భంగా రాజకీయపార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ సెలవు పెట్టిన, మారిపోయిన బిల్వోల స్థానాల్లో వచ్చిన వారి వివరాలను అందించాలని కోరరు.. త్వరలోనే అందిస్తామని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తిరుపతి అర్బన్ ఎమ్మార్వో వెంకట సూర్యనారాయణ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిటి అశోక్ రెడ్డి, ఎఈఆర్వోలు, ఎన్నికల సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారులో తరలిస్తున్న రూ. కోటి స్వాధీనం

పత్రాలు పరిశీలన అనంతరం అప్పగింత

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యాపారస్తులు, శుభకార్యాలకు ప్రజలు నగదు, ఇతర విలువైన వస్తువులను తరలింపుకు సరైన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని చంద్రగిరి సిఐ రామయ్య తెలిపారు. చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలోని గాధంకి టోల్ ప్లాజా వద్ద అనుమానాస్పదంగా కారులో తరలిస్తున్న కోటి రూపాయలను మంగళవారం పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కారులో నగదు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. టోల్ ప్లాజా వద్దకు కారు రాగానే పోలీసులు తనిఖీ చేయగా సదరు కారులో కోటి రూపాయలు నగదు ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని చంద్రగిరి ఎస్ఐ అనితకు సమాచారం అందించారు. ఎస్ఐ అనిత తమ సిబ్బందితో టోల్‌ప్లాజా వద్దకు వెళ్లి పరిశీలించారు. నగదును తరలిస్తున్న వ్యక్తులు సరైన ధ్రువపత్రాలు చూపించి, ఈ నగదు బెంగళూరుకు చెందిన ఓకన్స్ట్రక్షన్ కంపెనీకి చెందినదని బెంగుళూరు నుండి చెన్నైకి తరలిస్తున్నామని తెలపడంతో ఎస్ఐ విషయాన్ని పైఅధికారులకు తెలియజేశారు. వారి ఆదేశాల మేరకు ఎస్ఐ సంబంధిత వ్యక్తులకు నగదును అప్పగించినట్లు సిఐ తెలిపారు.



గాదంకి టోల్ ప్లాజా వద్ద కోటి రూపాయలను పట్టుకున్న పోలీసులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తొలగిస్తాం..

- ఇద్దరికి షోకాజు నోటీసులు
- ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎన్ఆర్ఈజీఎస్ పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆగ్రహం

ప్రజాశక్తి - కోట : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల విధివిధానాల్లో నిర్లక్ష్యం వహిస్తే విధుల నుండి తొలగిస్తామని తిరుపతి జిల్లా ఎన్ఆర్ఈజీఎస్ పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ నేపథ్యంలో కోట మండలంలోని 21 పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ధ్వజమెత్తారు.

నిర్లక్ష్యం వహించిన ఫీల్డు అసిస్టెంట్లపై ఆగ్రహం

పలు పంచాయతీలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు లేకుండానే తూతూ మంత్రంగా మస్టర్లను సిద్ధం చేసుకుంటున్నారని, 'పంచాయతీలో పనులు లేకుండా మౌనంగా ఉండే ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు ఎందుకు ఇస్తున్నారు?' అని ఏపీవో పూర్ణిమను నిలదీశారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో ఉండే చెత్తా చెదారాన్ని తక్షణమే తొలగించండి..' అంటూ ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్దేశించి మాట్లాడారు. పలు పంచాయతీల్లోని మస్టర్లు, కర్లపూడి, పుచ్చలపల్లి, తదితర పంచాయతీల్లోని రిజిస్టర్లలో పలు విషయాలు చాలా వ్యత్యాసంగా ఉన్నాయని తనిఖీ క్లస్టర్ పీడీకి తెలిపారు. కోట, కొత్తపట్నం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇవ్వాలని, వారి పనితీరు ఇలాగే ఉంటే ఎంపిడిఓ కు సరెండర్ చేయాలని ఏపీఓకు సూచించారు. మండల పరిధిలో ఏడు గురు విధుల్లో సక్రమంగా ఉన్నారని, మరో నలుగురు పర్వాలేదని, మండలంలోని మిగతా వారి విధి విధానాలపై టార్గెట్ చేశామని గుర్తు చేస్తూ రానున్న రోజుల్లో తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అన్ని పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు ఇప్పటివరకు ఒక విధం అని, ఇక జరిగే పని దినాల్లో నిఘా పెట్టి పని తీరు మారకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీల్లోనే సర్పంచులకు, ఏపీఓ లకు మంచిగా ఉంటే సరిపోదని, విధుల్లో సక్రమంగా ఉండి ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు పీడీ తెలిపారు. కర్లపూడి, పుచ్చలపల్లి పంచాయతీల్లో ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు.



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

రూ.1,98,000 సొమ్ము రికవరీ

ఎన్ఆర్ఈజీఎస్ కింద 1 లక్షా 14 వేల 5 రూపాయలు, పంచాయతీ రాజ్ పనుల కింద 84,600 రూపాయలు, తదితర వాటిలో 1,98,000 రూపాయలను రికవరీ చేశామని పీడీ పేర్కొన్నారు. అనంతరం స్థానిక కాంట్రాక్టరు దువ్వూరు రఘురామిరెడ్డి సచివాలయ కేంద్రాలను నిర్మించినా కొన్ని బిల్లులు అందలేదని పీడీ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే ఆయన స్పందించి సంబంధిత ఏపీవోలతో మాట్లాడే సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. వెంకన్నపాలెంలో కూడా సచివాలయాలు నిర్మించినప్పటికీ కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు కాకపోవడంతో వారి సమస్యను పీడీకి తెలిపారు. పని పూర్తిచేసిన తర్వాత సంబంధించిన బోర్డులు పెట్టడం లేదని ఓ విలేకరి పీడీని అడగగా ఇకపై అలా జరగకుండా బోర్డులు పెట్టేలా చూస్తామన్నారు. ప్రతి పంచాయతీలో 1,50 వేల రూపాయలు తగ్గకుండా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్, విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మ్యాన్ రాసరా రాయుడు, తిరుపతి కోర్స్ డైరెక్టర్ దొమ్మురాజు చంద్రశేఖర్ రాజు, ఎంపిడిఓ శంకరయ్య, కోట, వాకాడు ఏపీఓలు పూర్ణిమ, విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిల్లి ప్రసవ వేదన.. !

మానవత్వం చాటుకున్న ఇంటి యజమాని



పిల్లిని రక్షించిన వైద్యుడు డి వేణుగోపాల్

ప్రజాశక్తి - ఓజిలి : ఓ పిల్లి ప్రసవ వేదనతో నరకం అనుభవిస్తూ ప్రాణాపాయ స్థితిలో వుండడం గ్రహించి కాన్పు నిమిత్తం సుమారు 40 కిలోమీటర్లు దూరంలో ఉన్న వైద్యుడు వద్దకు తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయించి మానవత్వం చాటుకున్న సంఘటన ఓజిలి మండలంలోని ఆరిమేనుపాడు గ్రామంలో మంగళ వారం వెలుగు చూసింది. ఆరిమేను పాడు గ్రామానికి చెందిన షేక్ అల్లా బక్షు ఇంట్లో ఉన్న పిల్లికి కాన్పు సమయంలో రెండు కాళ్లు బయటకొచ్చి తల మాత్రం గర్భంలోనే ఉండి పోయింది. పిల్లి పడుతున్న ప్రసవ వేదన చూసిన అల్లాబక్షు కుమార్తెలు కంటతడితో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. అర్ధరాత్రి సమయం కావడంతో మంగళవారం ఉదయం అల్లాబక్షు ఆ పిల్లిని తీసుకొని నాయుడుపేటలో ఉన్న ప్రముఖ ప్రభుత్వ పశు వైద్యుడు డి.వేణుగోపాల్ వద్దకు వెళ్లాడు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స అందించి ప్రాణదానం చేశారు. మూడు పిల్లలకు పిల్లి జన్మనివ్వగా అందులో ఒక పిల్ల చనిపోయింది. పిల్లితో పాటు మరో రెండు ప్రాణాలను కాపాడిన సంఘటనపై అక్కడున్నవారు ఆశ్చర్యానికి గురయ్యారు. మానవ సంబంధాలు కనుమరుగవుతున్న ఈ రోజులలో పిల్లి ప్రసవం కోసం తపన పడిన అల్లా బక్షు మానవత్వానికి పలువురు ప్రశంసలు కురిపించారు.

క్రైం న్యూస్

గుర్తుతెలియని వాహనంఢీ

మహిళ మృతి

ప్రజాశక్తి-తడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. తడ మండలంలోని రామాపురం కుప్పం గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధ రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని 60 సంవత్సరాల మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు రామాపురం కుప్పం గ్రామం వద్ద జాతీయ రహదారిపై చెన్నై నుండి నెల్లూరు వెళుతున్న మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు తెలిపారు. మహిళ తల భాగం బాగా నుజ్జు నుజ్జు అవడంతో గుర్తించడం కష్టతరంగా మారిందని తడ పోలీసులు తెలిపారు. మహిళ ఎర్ర రంగు చీర ధరించివుందని ఎవరైనా గుర్తిస్తే తడ పోలీసులకు తెలపాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు: డిఎస్పి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీయస్పీ మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రగతి స్వచ్ఛంధ సంస్థ వారు ముద్రించిన గోడపత్రికలను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21ఏళ్లు వచ్చేవరకు వివాహం చేయకూడదన్నారు. ప్రగతి మండల కో-ఆర్డినేటర్ ప్రభాకర్, రామచంద్ర చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. బాల్య వివాహాల వలన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

తేజను పరామర్శించిన పులివర్తి నాని

ప్రజాశక్తి- రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగి రి మండలం పరిధిలోని ముంగిలపట్టు గ్రామానికి చెందిన మోహన్ నాయుడు కుమారుడు తేజ ప్రమాదవశాత్తు గాయ పడ్డాడు. విషయం తెలుసుకున్న చిత్తూరు పార్ల మెంటరీ పార్టీ అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మంగళవారం తేజను పరామర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేంకటాద్రిరాముడు

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం శ్రీనివాసుడు శ్రీరాములు అలంకారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 గంటలకు స్వామి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామి ఉత్సవం కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి

జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి కరుణాకరన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈనెల 16న నిర్వహించనున్న లోక్ అదాలత్‌తో మీ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి కరుణాకరన్ ఆదేశించారు. మంగళవారం పుత్తూరు కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్, బ్యాంక్, శాఖలు న్యాయవాదులతో కలిసి శాఖల పరిధిలో పెండింగ్ కేసులు పరిష్కరించేందుకు అందరూ సహకరించాలని కోరారు. వారి శాఖలలో ఉన్న పెండింగ్ కేసులను అడిగి తెలుసుకున్నారు. న్యాయ వాదుల పరిధిలో ఉన్న కేసులను పరిష్కారానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి, ఎంపీడీవోలు, తహశీల్దారులు, సీఐ ఓబులేసు, ఎస్ఐ వెంకట మోహన్, నగరి, నారాయణవనం, కార్వేటినగరం, రామచంద్రాపురం మండల పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్కిమ్స్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక స్కిమ్స్ కళాశాలలో మంగళవారం రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ వారిచే ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్, కళాశాల కరస్పాండెంటు మిద్దెల హరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రాంగణ ఎంపికలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిశ్రమల హబ్ గా అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులు ఎంబీఏ, ఎంసీఏ వంటి వృత్తి విద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలను పెంచుకోవాలన్నారు. ప్రతి యేటా రిలయన్స్ వారు తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలను నిర్వహిస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ నుంచి విచ్చేసిన హెచ్ఆర్ భాను ప్రకాష్, మార్కెటింగ్ మేనేజర్ హరీష్ సుంకార రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను ఎంపికచేసి నియామక పత్రాలను అందించారు. అనంతరం భాను ప్రకాష్ హరీష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి, డైరెక్టర్ ఏ.శ్రీ కుమార్, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్తు విద్యార్థుల వీడ్కోలు సభ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం ప్రధానోపాధ్యాయులు కే రమణ ఆధ్వర్యంలో టెన్తు విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా సరస్వతి పూజ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల రమణయ్య మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు విద్యార్థులు బాగా రాయాలన్నారు. అనంతరం విద్యార్థినివిద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఒక్కో విద్యార్థి వారి ప్రతిభను ప్రదర్శించారు. దేశభక్తి గీతాలు, వాతావరణ కాలుష్యాన్ని గురించి , బాల్యవివాహాల అనర్థాల గురించి విద్యార్థిని విద్యార్థులు చూపిన ప్రతిభ ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను మంత్రముగ్ధుల్ని చేసింది. అనంతరం ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు రమణ య్యను ఘనంగా శాలువాతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుల రమణయ్యను, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులను పూర్వ విద్యార్థులు బుద్ధుని విగ్రహంతో సన్మానించారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహించి బుచ్చినాయుడు కండ్రిగ మండల ప్రజలను విద్యార్థిని విద్యార్థులు ఆనందింపజేశారు. చిట్టచివరిగా ఉపాధ్యాయులు విద్యార్థినులు కలిసి 'ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి..' అనే పాటకు అందరూ కలిసి నృత్య ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్పుతోనే మహిళా సాధికారత: మాజీ ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సమాజం దృష్టి కోణంలో మార్పుతోనే మహిళా సాధికారత సాధ్యమౌతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు దిశానిర్దేశం చేశారు. సంప్రదాయాలు మంచివే కానీ, సాధికారతకు అడ్డంకిగా మారిన కొన్ని సాంఘిక అంశాల విషయంలో పునరాలోచన జరగాలని సూచించారు. రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళ స్వయం ఉపాధి కోసం రుణాలను అందించారు. వారంతా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. ప్రజాసంక్షేమం, అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతే లక్ష్యంగా గత నాలుగున్నర దశాబ్దాలుగా రాస్ సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడి

పెట్రోలు బంకు సీజ్

ప్రజాశక్తి -బాలాయపల్లి: మండల కేంద్రంలో ఉన్న భారత్ పెట్రోల్ బంకు లో డీజిల్ ,పెట్రోలు తక్కువ పడుతున్నారని సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు పది రోజుల క్రితం దాడులు చేసి డీజిల్, పెట్రోల్ తక్కువ వస్తున్నాయని నిర్ధారణ చేసి పెట్రోల్ బంకును మూసేశారు. దీంతో మండల కేంద్రం చుట్టూ ఉన్న పల్లెల ప్రజలు పెట్రోలు డీజిల్ కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మనిషి జీవనాధారమైన పెట్రోల్, డీసలు నిత్యవసర వస్తువైంది అదే అవసరాన్ని ఆసరా చేసుకొని బాలా యపల్లి మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్ యాజమాన్యం ప్రజలను మోసం చేస్తూ లీటర్ పెట్రోల్ కు 100 మిల్లీ లీటర్లు తక్కువ పట్టడం గమనించిన ప్రజలు విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విజిలెన్స్ అధికారులే స్వయంగా వచ్చి లీటర్ బాటిల్లో ఒక లీటర్ పెట్రోల్ పట్టించగా అందులో 100 మిల్లీ లీటర్లు తక్కువ రావడం గమనించారు. ఐదు లీటర్ల క్యాన్ లో కూడా డీజిల్ పట్టారు. అందులో అర్ధలీటరు తక్కువ రావడంతో వెంటనే పెట్రోల్ బంకును సీజ్ చేశారని తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ అండ్ ఆంధ్రమహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర మహిళ మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా రేఖన్ , మల్లిక 5 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య వందన, క్లబ్ సెక్రటరీ శశి రేఖ, మహిళ మండలి అధ్యక్షురాలు జమున, స్నేహలత, లక్ష్మీ, రెడ్ క్రాస్ సభ్యులు జానా సుధీర్, శ్రీనివాస ఆచారి, పల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి బాబు వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్): రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శిగా తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామానికి చెందిన బిరుదాల భాస్కర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవి రావడానికి ముఖ్య కారకులైన చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, పులివర్తి సుధా రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బిరుదాల భాస్కర్ రెడ్డికి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షుడు ఏ ఈశ్వర్ రెడ్డి, ఈ మధుసూదన్ నాయుడు, వైకుంఠం శ్రీధర్ నాయుడు, గౌస్ బాషా, వి సుబ్రహ్మణ్యం నాయుడు పలువురు టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి- నారాయణవనం: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వారి నివాసంలో నారాయణవనం మండలం నాయకులు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మండల కన్వీనర్ సొరకాయలు, ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు మంత్రిని కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీముని చెరువు పంచాయతీ, భీముని చెరువు గ్రామానికి చెందిన యువకులు మొండి వెంకటేష్, ఎరుకంబట్టు సుకుమార్, ఎరుకంబట్టు గోవిందస్వామి, బాలిగాని ప్రేమ్ కుమార్, సందీప్ కుమార్, కంబుకోటి ఉమాపతి, ఎన్ మదన్ కుమార్, ఎరుకంబట్టు వెంకటేష్ పాల్గొన్నారు.

ఈవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి - బాలాయపల్లి : బూత్ లెవెల్ అధికారులు వారి పరిధిలోని ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించాలని తహశీల్దారు కే పుల్లారావు పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు సూపర్వైజర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ ఓ వసుంధర్, శివ, ప్రసాదు, రేణుక, సాయి, సత్తార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డాక్టర్ మురళికి కేంద్ర సంస్థ విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: టిటిడి ఆయుర్వేద వైద్యశాలతో పాటు తిరుపతి నగరంలో 36 సంవత్సరాలుగా డాక్టర్ మురళీకృష్ణ ఆయుర్వేద వైద్యులుగా విశేష సేవలు అందించారు. దక్షిణ భారత దేశంలో ఆయన ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన ఆయుష్ అనుబంధ సంస్థ నేషనల్ అకాడమీ ఆఫ్ ఆయుర్వేదిక్ అత్యున్నత పురస్కారాన్ని అందించింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణను ఫెలోఆఫ్ నేషనల్ అకాడమీఆఫ్ ఆయుర్వేదిక్ అవార్డు ప్రదానం చేశారు. ఈసందర్భంగా కేంద్ర ఆయుష్ విభాగం కార్యదర్శి డాక్టర్ రాజేష్ కొటేచా డాక్టర్ మురళీకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం అధ్యక్షులు పద్మభూషణ్ వైద్య దేవేంద్ర త్రిగ్గురు, నేషనల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వందన, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద డైరెక్టర్ తనుజ నేస్త్రి పాల్గొన్నారు,

వెంకయ్య నాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ ముప్పవరపు వెంకయ్య నాయుడుని తిరుపతిలోని పద్మావతి గెస్ట్‌హౌస్‌లో ఏబిఆర్ఎస్ఎమ్ ప్రతినిధులు కలిసి పద్మ విభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా సత్కరించారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ తిరుపతి భక్తులకే కాక దాదాపు లక్ష మంది విద్యార్థులు చదువుతున్న 10 రాష్ట్ర, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలు కలిగి ఉండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఒక గొప్ప విద్యా కేంద్రంగా వెలసిల్లటం సంతోషించదగ్గ విషయమన్నారు. తిరుపతి దేశంలోనే ఒక గొప్ప విద్యా కేంద్రం గానూ అభివృద్ధి చెందుతుందన్నారు. ఏబిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, టీటీడీ విద్యాసంస్థల కన్వీనర్ డాక్టర్ ఎం.పద్మావతమ్మ, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: అభినయ్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్: వచ్చే ఎన్నికల్లో నూతన ఓటర్లు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీకాం డిగ్రీ కాలేజ్‌లో నూతనంగా ఓటు హక్కు పొందిన తిరుపతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో నిబద్ధతతో అంకితభావంతో తిరుపతి అభివృద్ధికి కట్టుబడి బృహత్తరమైన అభివృద్ధి చేసి చూపి నగరాన్ని నేర రహితంగా, దేశంలోనే అత్యంత అందమైన పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దాలని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ముందుకెళ్తున్నా భూమన అభినయ్ రెడ్డికి అండగా నిలబడాలని విద్యార్థులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పసుపు లేటి సురేష్,14 డివిజన్ అధ్యక్షుడు అనిల్ రెడ్డి వైయస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్ కుమార్, స్టేట్ ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి నాగరాజు, వైయస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ముని, నరేష్ ,నాగేంద్ర, ప్రశాంత్ ,పవన్, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మహిళా వర్సిటీలో 21వ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ - విసి ఆచార్య భారతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 7వ తేదీ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరవుతున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి. భారతి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయం నాక్ కమిటీచే ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందని బోధన, పరిశోధన రంగాల్లో విశేషమైన, ఘనీయమైన అభివృద్ధిని సాధించిందని, పురోగతిపై పయనిస్తుందని అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవాన్ని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించనుందన్నారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త ఎస్. మంగళ మణి హాజరవుతారని, మహిళా వర్సిటీ డిగ్రీలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత సింగర్ పి.సుశీల కు అందిస్తారన్నారు. ఈ పద్మా వతి మహిళా విశ్వ విద్యాలయం గోల్డ్ మెడల్స్ ను సైన్స్ కోర్సు లలో 30 మందికి, సోషియల్ సైన్స్ లో 21 మందికి, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఆరుగురు విద్యార్థులకు అందిస్తారన్నారు. మహిళా వర్సిటీ బుక్ ప్రైస్ లను సైన్స్ శాస్త్రాలలో ఐదు గురికి, సోషల్ సైన్స్ శాస్త్రాలలో ఏడు గురికి అందిస్తారన్నారు. క్యాష్ ప్రైస్ అవార్డులను సోషల్ సైనెన్స్ లో ముగ్గురికి, ఇంజనీరింగ్ టెక్నాలజీలో ఒకరికి అందిస్తున్నామన్నారు. 21వ స్నాతకోత్సవంలో మొత్తం ప్రత్యక్షంగా 859 డిగ్రీ పట్టాలను, ఇన్ ఆబ్సెంట్ కింద 259 మందికి, ఇన్ అడ్వాన్స్ కింద 430 మంది, మొత్తం 1548 మంది ఈ స్నాతకోత్సవంలో డిగ్రీలను అందుకోనున్నారన్నారు.



మాట్లాడుతున్న శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ విసి భారతి

తలకోన శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం అంకురార్పణతో ఘనంగా ప్రారంభించారు. ఐదు రోజులు పాటు నిర్వహించే ఈ శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శాస్త్రం ప్రకారం బహుళ చతుర్దశి పుట్ట మన్నుతో నవధాన్యాలు సేకరించి వేద పండితులచే మంత్రాల నడుమ శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించినట్లు ఈవో జైకుమార్ పేర్కొన్నారు. వారం రోజులపాటు శివరాత్రి జాగరణ, కల్యాణోత్సవం, సిద్ధ పూజ, మారుపొంగల్లు జరుగుతాయని ఆయన తెలిపారు. భక్తులకు తాగునీరు, వైద్య సౌకర్యం, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకి పీలేరు, తిరుపతి, రాయచోటి, కోడూరు, ఆర్టీసీ డిపోల నుండి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశామని, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు కల్పించామని తెలిపారు. అన్నదానం స్థలం వరకు మాత్రమే గుడి సమీపంలోకి వాహనాలకు అనుమతి ఉంటుందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. గుడి ఆవరణ నుంచి మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ లైటింగ్ భక్తులకు సౌకర్యం గా ఉండే విధంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పాలక మండలి సభ్యులు జయంత్, నాగిరెడ్డి, ప్రధాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



తలకోనలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజానాడి గుర్తించి నగరి టికెట్ ఇవ్వండి

అధిష్టానానికి వైసిపి నాయకుల వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజానాడిని గుర్తించి నగరి టికెట్ ఇవ్వాలని అధిష్టా నానికి వైసిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగరి నియోజకవర్గ పరిధిలోని విజయ పురం, పుత్తూరు, నింద్ర, వడమాల పేట, నగరి మండలాలకు చెందిన వైసిపి కీలక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడమాలపేట జెడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజానాడిని గుర్తించి నగరి టిక్కెట్ ఇవ్వాలని కోరారు. నగరి నియోజకవర్గంలో ప్రస్తుత మంత్రి రోజాను గెలిపించడానికి ఆస్తులను అమ్ముకొని కష్టపడ్డామని, 'నాకు ఐదుగురు అన్నదమ్ములు అని ప్రతి సభల్లో ఊదరకొట్టిన రోజా ఇప్పుడు మా ఐదు మండలాలకు సంబంధించిన ఐదుగురిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వడమాలపేట జెడ్పిటిసి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు మురళీధర్ రెడ్డి, రెడ్డివారి భాస్కర్ రెడ్డి, ఏలుమలై, రవిశేఖర్ రాజు మాట్లాడుతూ 2004 నుండి 2009 వరకు టిడిపిలో ఉన్న రోజా అప్పటి కాంగ్రెస్ దెబ్బకు ఓటమిపాలైందని, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరారని, వరుసగా ఓటమిపాలైన రోజాకు బాసటగా నిలిచామని, ఐరన్ లెగ్ గా పేరు పొందిన రోజాను గోల్డెన్ లెగ్‌గా మార్చి ఎమ్మెల్యే, మంత్రిగా చేశామన్నారు. కానీ ఆ నాడు 'ఐదుగురు అన్నదమ్ములు నాకు ఉన్నారు' అని చెప్పిన రోజా, నేడు నియోజకవర్గాన్ని తన అక్రమ ఆర్జనకు అడ్డగా చేసుకొని తమని పక్కకు నెట్టేసిందన్నారు. అంతా ఆమె ఆధిపత్యం సాగుతోందని, తమ కష్టాన్ని మరిచిపోయి ఇష్టానుసారం వ్యవహరిస్తోందన్నారు. వైసిపికి పనిచేస్తామే కానీ, ఇలా నగరి నియోజకవర్గాన్ని దోచుకోవడానికి అడ్డాగా చేసుకున్న రోజాకు సహకరించబోమని హెచ్చరించారు. ఈ క్రమంలో వైసీపీ అధిష్టానం ప్రజానాడిని గుర్తించి ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తేనే సత్ఫలితాలు ఉంటాయని, లేకుంటే నగరి సీటు కోల్పోవాల్సి వస్తుందన్నారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నామని, తమపై నిందారోపణలు మోపుతున్న మంత్రి రోజా ఓపెన్ డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు. 'మీరంతా నాకు అండగా నిలబడకపోతే ఓడిపోతాను' అని కన్నీళ్లు పెట్టుకున్న రోజా నేడు తమకు కన్నీళ్లు తెప్పించేలా ప్రవర్తిస్తున్నారన్నారు. నగరిలో మంత్రి రోజా పట్ల ప్రజలు సానుకూలంగా లేరని, తాము ప్రజలను అనుసరించి నడుచుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వాసుదేవ రెడ్డి, మునీంద్ర, లక్ష్మీపతిరాజు, శ్రీధర్ రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడమాలపేట జెడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి

తాగునీటి కుళాయిని పునరుద్ధరించాలి: సిపిఎం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న తాగునీటి కుళాయిని పునరుద్ధరించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ పుత్తూరు నడి బొడ్డున తాగునీటి కుళాయిని మున్సిపల్ అధికారులు నిలిపివేయడం ప్రజల తాగునీటిని అడ్డుకోవడమేనన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో ఈ కుళాయి ఆపివేయడంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులు, వృద్ధులు, విద్యార్థులు, వికలాంగులు, వ్యాపారస్తులు, ఆటో కార్మికులు, పుత్తూరులో నడుస్తున్న ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడే ఎండలో తీవ్రం కావడం వల్ల తాగునీటికి పుత్తూరు పట్టణంలో ఇబ్బందులు పడు తుంటే ఉన్న కుళాయిని మున్సిపల్ అధికారులు మూసివేయడం అన్యా యమని ఆవేదన వ్యక్తం చేశా రు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, ఏఈ స్పం దించే వెంటనే ఆ కుళాయిని పునరుద్ధ రించాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై నందయ్య, ఏ విజయ్, సుధాకర్, మనోహర్, కృష్ణమూర్తి, ఏ రవి, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, విద్యార్థులు

నకిలీ విలేకరి పై చర్యలు తీసుకోవాలి

ఉపాధ్యాయ సంఘాల వినతి

ప్రజాశక్తి-నాయుడుపేట: గత కొన్ని నెలలుగా ఒకే స్కూల్ పై అనవసరమైన అవసరం లేని రాతలు రాసి ఉపాధ్యాయులను తాను అడిగిన డబ్బులు ఇవ్వాలంటూ ఇబ్బంది పెడుతున్న ఒక నకిలీ విలేకరిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మనం పేరుతో నకిలీ పిడిఎఫ్ ఆన్లైన్ పేపర్ కటింగ్ లతో బ్లాక్ మెయిల్ చేస్తున్న నకిలీ విలేకరి బల్లి హరిబాబుపై చర్యలు తీసు కోవాలంటూ నాయుడుపేట సిఐ శ్రీనివాసన్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఫిర్యాదు స్వీకరించిన నాయుడుపేట సీఐ అతనిపై చర్యలు చేపట్టి మరోసారి ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు యుటిఎఫ్ నాయుడుపేట మండల శాఖ అధ్యక్షులు కొనిశెట్టి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, బిటిఏ రాష్ట్ర నాయకులు పేర్నేటి రామకృష్ణ, ఆర్‌యుపిపి జిల్లా గౌరవ అధ్యక్షులు గడదాసు వెంకటేశ్వర్లు, నాయుడుపేట సిపిఎం నాయకులు శివకవి, ముకుందా, చేపల వెంకటేశ్వర్లు,యుటిఎఫ్ నాయ కులు రాజశేఖర్ రెడ్డి, బిటిఏ జిల్లా నేత జె వెంకట్రావు, ఐద్వా మహిళా నేత చంద్రకళ, ముఠావర్కర్స్ యూనియన్ రమణయ్య, ఆటో యూనియన్ బుప్పయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ ఉన్నారు.



పిల్లల జీవితాలను నాశనం చేయొద్దు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు అనంతరం తల్లిదండ్రులు ఖర్చు పెట్టి మరి కార్పొరేట్ విద్యా సంస్థలలో చేర్పిస్తారని.. పిల్లల భవిష్యత్ బాగుండాలని కలలు కంటారని కానీ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల మోత తో పాటు అన్ని మోసంతో కూడిన విద్య, ఒత్తిడి, ర్యాంక్, మార్క్స్ లలో విద్యార్థులను మానసికంగా హింసిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్ రవి అన్నారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ సమావేశంలో కార్పొరేట్ విద్యా సంస్థల ప్రలోభాలకు గురి చేసి విద్యార్థుల జీవితాలను నాశనం చేయొద్దని ముద్రించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ర్యాంక్, మార్క్స్ అంటూ ప్రచారం తప్ప విద్యార్థుల ఎదుగుదలకు ఏమాత్రం కృషి చేయకుండా జీవిత పాఠాలను చెప్పకుండా విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని వారు వాపోయారు. కార్పొరేట్ కళాశాల లో వివక్షత తో కూడిన విద్యా విధానం అమలు అవుతోందని దీనిపై ఆర్ఐఒ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే కళాశాల లో వివిధ కోర్సులకు విచ్చలవిడిగా ఫీజుల వసూలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఫీజును బట్టి విద్యార్థులకు విద్యను అందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారులు మొద్దు నిద్ర లేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, హరిత, ప్రసాద్, తేజ, జిల్లా నాయకులు సుష్మిత, ఉమేష్, గురువయ్య పాల్గొన్నారు.

14వ వార్డు సమస్యలు పరిష్కరించాలి : కౌన్సిలర్

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆరి శంకరయ్య పేర్కొన్నారు. వెంకటగిరి నడిబొడ్డిలో ఉన్న సర్వేనెంబర్ 215 అమ్మవారిపేట చెరువు 36 ఎకరాల 10 సెంట్లు స్థలం ఆక్రమ ఆ చెరువుపై ఆధారపడి ఉన్న మాగాన్ని వ్యవసాయ భూములు ప్రస్తుతం లేఅవుట్లు అవ్వడం వల్ల చెరువు పూర్తి స్థాయిలో నిరుపయోగంగా ఉంది. కుమ్మరి మిట్ట నుంచి చెరువుగట్టును చదును చేసి రాణి పేట వరకు ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తే మిగిలిన చెరువు ప్రాంతాన్ని సుందరీ కరణ చేసి పార్కుగా తీర్చిదిద్దితే వెంకటగిరి కి మరో నిదర్శనం అవుతుంది చుట్టుపక్కల ప్రాంతాలు కూడా ఖాళీగా ఉన్న లేఔట్లు ఇల్లులు నిర్మించుకుని ఆ ప్రాంతం మొత్తం అభివృద్ధి అవకాశం ఉందని, తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఈ పార్కును వెంకటగిరి ప్రజలకు బహుమతిగా ఇవ్వాలని వెంకటగిరి ప్రజలు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అయితేనే ఈ పనిని చేయగలరు అని వెంకటగిరి ప్రజలు విశ్వసిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వెంకటగిరి ప్రజల కోరికను నెరవేర్చాలని కోరారు.

కాపు సంక్షేమ సేనపై విశ్వాసం లేదు

మాజీ కాపు సంక్షేమ శాఖ అధ్యక్షులు గంగుపల్లి వంశీ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): రాష్ట్రంలోని కాపు బలిజలను అయోమయానికి గురిచేస్తూ వివాదాలకు కారణమవుతున్న కాపు సంక్షేమ సేనపై తమకు విశ్వాసం లేదని, జనసేనాని కోసమే అందులో కొనసాగామని మాజీ కాపు సంక్షేమ శాఖ తిరుపతి పట్టణ అధ్యక్షులు గంగుపల్లి వంశీ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరి రామ జోగయ్య లేఖలు రాస్తూ కాపులలో చీలిక తేవడానికి కారణమవుతున్నారని దీనిపై జనసేన నాయకులు స్పందిస్తే కాపు సంక్షేమ సేన నుండి తనను, హిమవంతు, కొండ రాజమోహన్‌ను కాపు సంక్షేమ సేన నుండి తొలగిస్తున్నట్లు మీడియాకు లేఖలు విడుదల చేశారన్నారు. శతకోటి సంస్థల్లో కాపు సంక్షేమ సేన ఒకటేనని అందులో కొనసాగడం తమకు ఇష్టం లేదని తొలగింపు లేఖలను మీడియా ఎదుట చించి పడేశారు. పవన్ కళ్యాణ్ తన సొంత నిధులతో పార్టీ ఏర్పాటు చేసుకొని రాజకీయాలలో కొనసాగుతున్నారని, ఆయన ఎవరిని అడిగి పొత్తులు ఏర్పాటు చేసుకోవాలో చెప్పాలని జోగయ్యను డిమాండ్ చేశారు. తన కన్న కొడుకుని అదుపు చేయలేని జోగయ్యకు రాష్ట్ర కాపులను దిశా నిర్దేశం చేసే అర్హత లేదన్నారు. జోగయ్య కుమారుడు చేగుండి సూర్య ప్రకాష్ వైసీపీలో చేరుతూ పవన్ కళ్యాణ్‌పై దుమ్మెత్తి పోయడంపై హరి రామజోగయ్య ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాపుల అభ్యున్నతి కోసం పాటుపడే పవన్ వెంట తాము కొనసాగుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాగరాజు రాయల్, సురేష్ పాల్గొన్నారు.